
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





- అధిక వానలతో జిల్లాలో పెరిగిన దిగుబడి
- గ్రామీణ పేదలకు మూడు నెలలపాటు ఉపాధి
- జోరుగా సాగుతున్న విక్రయాలు
- గంప ధర రూ.200 నుంచి 400
- సహజ సిద్ధంగా పండటంతో.. ముమ్మర కొనుగోళ్లు

వికారాబాద్ జిల్లాలో గ్రామీణ నిరుపేదలకు అడవుల నుండి కాలానుగుణంగా లభించే పలు రకాల పండ్లు, ఇతర అటవీ ఉత్పత్తులు జీవనాధారమవుతున్నాయి. వాటిని సేకరించి, వాటిని విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో ఉపాధిని పొందుతున్నారు. ప్రస్తుతం సీతాఫలాల సీజన్ నడుస్తోంది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ పండ్లంటే చిన్నా పెద్దా అంతా ఇష్టంగా తింటారు. దీంతో అటవీ ప్రాంత సమీపంలో సహజ సిద్ధంగా పెరిగి పెద్దయిన సీతాఫలం చెట్ల నుండి కాయలను కోసుకువచ్చి, వాటిని గంపల్లో మూటకట్టుకొని పట్టణ ప్రాంతాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.



# ప్రకృతి వరప్రసాదం సీతాఫలం

(యాచారం/ధారూరు ప్రభాతవార్త)

సీతాఫలం.. పుష్కలమైన పోషకాలకు నిలయం. పేదోడి ఆపిల్‌గా కూడా పిలుస్తుంటారు. ఈ పండు తియ్యదనంతోపాటు పేదల జీవితాల్లో ఉపాధి కల్పించే ప్రకృతి వర ప్రసాదమవుతోంది. సీజన్‌లో మాత్రమే కాసే ఈ సీతాఫలాలు అందరికీ అందుబాటులో లభిస్తున్నాయి. హైదరాబాద్ సమీపంలోని పలు ప్రాంతాలు సహజంగా పండించిన సీతాఫలాలకు కేరాఫ్ అడ్రస్‌లుగా ఉన్నాయి. అందులో వికారాబాద్ జిల్లా ఒకటి. సెప్టెంబరు చివరివారం నుంచి మొదలుకుని నవంబరు వరకూ ఈ ఫలాలు విరివిగా లభిస్తాయి. కురిసిన వర్షాల ు బట్టి వీటి దిగుబడి ఉంటుంది. ఈ సీజన్‌లో ఈసారి వానలు బాగానే కురువడంతో జిల్లాలోని అటవీప్రాంతాలు, గుట్టలు పూర్తిగా సీతాఫలం వృక్షాల పచ్చదనంతో నిండిపోయాయి. దీంతో జిల్లాలో దిగుబడి గణనీయంగా పెరిగింది. దీంతో ఎలాంటి శ్రమ లేకుండా పుష్కలంగా పండిన సీతాఫలాలు స్థానిక చిరువ్యాపారులు, గిరిజనులు, మహిళలకు జీవనోపాధిగా ఉంది.

**వందలాది కుటుంబాలకు ఉపాధి**

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయి. దీంతో యాచారం, తాడిపర్తి, నజ్దిక్ సింగారం, కురుమిద్ద, మేడిపల్లి, కడ్తాల్, అమన్ గల్, కందుకూరు మండలాల్లోను.. ధారూరు మండలంలోని పిసిఏం తండా, గురుదోట్ల, జీడిగడ్డ తండా, రాంపూర్ తండా, గట్టేపల్లి తదితర గ్రామాల్లో విరివిగా పండే శీతాఫలాలను విక్రయిస్తూ వందలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. నిత్యం పనుల కోసం బారులు తీరి నిరీక్షించే కూలీలకు ఈ సీజన్‌లో చేతినిండా పని..మనీ దొరుకుతోంది.

**కుటుంబ సమేతంగా అడవి బాట**

కుటుంబ సభ్యులతో కలిసి అడవిబాట పడుతూ సీతాఫలం కాయల ు తెంపి, ప్రధాన రహదారులపై అమ్ముతున్నారు. కొంతమంది కార్మికుల సహాయంతో పండ్లను కోయించి గంపల్లో పెట్టుకొని మండల కేంద్రాలు, పట్టణాలో విక్రయిస్తుండగా.. మరికొందరు ఊరికి దగ్గరలో ప్రధాన రహదారులకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. కొందరు రైతులు కూడా కూలీల ద్వారా పండ్లను తెప్పించి వ్యాపారులు, మధ్యవర్తులకు అమ్ముతున్నారు. ప్రధాన రహదారుల వెంట వచ్చే పోయే వాహనదారులు వీటిని ఇష్టంగా కొనుగోలు చేసుకొని వెళుతున్నారు.

**పోషకాల గని..**

ప్రకృతి నుండి సహజ సిద్ధంగా పండే సీతాఫలం దిగుబడుల కోసం ఎలాంటి కృత్రిమ ఎరువులు వినియోగించరు. నోరూరించే ఈ పండును చిన్నా, పెద్దా తేడాలేకుండా ఎంతో ఇష్టంగా తింటుంటారు. పోషక విలువలతో కూడిన వీటిని తీసుకుంటే ఆరోగ్యానికి. జీర్ణ వ్యవస్థకు చక్కగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇవి తేలికగా జీర్ణం కావడంతోపాటు పోషక పదార్థాలు సమృద్ధిగా అందుతాయని పేర్కొంటున్నారు. వీటిలో గ్లూకోజ్, మిటమిన్ సీ, ఏ, బీ6, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్, యాంటిఆక్సిడెంట్లు, పిండిపదార్థాలు మెండుగా ఉంటాయని పేర్కొంటున్నారు.

**స్థానిక వ్యాపారులకు మిగిలేది అంతంతే..**

జిల్లాలోని పలు గ్రామాల్లో ఎక్కుగా సీతాఫలాల విక్రయాల సందడి



కనిపిస్తోంది. కూలీలు అడవిలోను, తమ వ్యవసాయ పొలాల వద్ద సేకరించి బుట్ట రూ.200 నుంచి రూ.400 వరకు విక్రయిస్తుండగా.. కొంతమంది హైదరాబాద్‌కు కూడా ఎగుమతి చేస్తున్నారు. పట్టణాల్లో వ్యాపారులు రూ.700 నుంచి రూ. 1000 వరకు వీటిని సొమ్ము చేసుకుంటున్నారు. ధర కాస్త ఎక్కువైనప్పటికీ తగిన పోషకాలు మెండుగా ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ సీజన్లో అన్ని పండ్ల కన్నా సీతాఫలాలకే ఎక్కువ డిమాండ్ ఉంటుందని వ్యాపారులు చెప్తున్నారు.



**–చెట్టుచెట్టుకు తిరిగి సేకరిస్తాం**


సీతాఫలాలు రెండు నెలలపాటు లభిస్తాయి. చెట్టుచెట్టుకు తిరిగి పండ్లు సేకరిస్తాం. రోజుకు రూ. 400 నుంచి రూ.500 వరకు వస్తోంది. ఎక్కడికో వెళ్లి కూలి పని చేయకుండా సీతాఫలాల అమ్మకాలతో ఇల్లు గడుస్తోంది.

– గట్టేపల్లి లక్ష్మమ్మ

## ఎన్నికల కోడ్‌కు తూచ్..

### నియమావళి అమలులో కార్యదర్శుల నిర్లక్ష్యం

**మంచాల, అక్టోబరు 5 ప్రభాతవార్త :** మంచాల మండలంలో ఎన్నికల నియమావళి అమలులో అధికారులు విఫలమవుతున్నారు. ప్రభుత్వాలు చేపట్టాన అభివృద్ధి కార్యక్రమాలకు సబంధించిన శిలాఫలకాలపై ఆయా పార్టీల హయాంలో ప్రజా ప్రతినిధుల పేర్లు వేసుకోవటం పరిపాటి. అయితే ఎన్నికల వేళ ఆయా నేతల పేర్లు ఓటర్లపై ప్రభావితం కాకూడదన్న లక్ష్యంతో శిలాఫలకాలను కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. మండంలోని చాలా గ్రామాలలో ఈ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. కొన్ని చోట్ల మాత్రం తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులిపేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని మంచాల, చిత్తాపూర్, తాళ్లపల్లి గూడ, లింగంపల్లి, జాపాల, ఎల్లమ్మ తండా, బోడకొండ, సత్తి తండా, ఆంబోతు తండా, లోయపల్లి గ్రామాలలో అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు.







ముసుగు వేయకుండా వదిలేసిన శిలాఫలాకల దృశ్యం





## దుద్దిళ్లకు ప్రతిష్టాత్మకం

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై సిఎం రేవంత్ ఫోకస్
- జెడ్పీ పీఠాలపై కాంగ్రెస్ పాగాకు పావులు
- ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక బాధ్యతలు
- వారం రోజులుగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల నేతలతో ముమ్మర భేటీలు
- స్థానిక సమీకరణాలపై బేరీజు
- అధిష్టానానికి చేరిన అభ్యర్థుల జాబితాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న మూడు జిల్లాల చైర్ పర్సన్ స్థానాలను కైవసం చేసుకోవడానికి హస్తం నేతలు సుదీర్ఘంగా చర్చలు కొనసాగిస్తున్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ మూడు జిల్లా లను కూడా జిల్లా పరిషత్ చైర్మన్లను అత్యధిక మెజా ర్టీతో గెలిపించడానికి ఆయా జిల్లాల ఇంచార్జీ మం త్రు లకు, సీనియర్ కాంగ్రెస్ నాయకులకు, ఎమ్మెల్యేలకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నాయకులకు బాధ్యత అప్పగించినట్లు సమాచారం. అందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష ్యంతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేపట్టారు. గత వారం రోజులుగా జిల్లాలోని నియోజకవర్గాల వారీగా స్థానిక శాసన సభ్యులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశమవుతున్నారు. స్థానిక సంస్థల్లో ఎట్టిపరిస్థి తుల్లోనూ పాగా వేయటానికి తీసుకోవాల్సి న కార్యచరణపై సమాలోచనలు చేస్తున్నారు. జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలతో, జిల్లా పార్టీ అధ్యక్షులు, నాయకులతో సమావేశాలు నిర్వహించారు.

**ఆ నాలుగు చోట్ల నుంచే అభ్యర్థి ఎంపిక**

రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సీటును 25 సంవత్సరాల తర్వాత తిరిగి షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ)కు రిజర్వుడ్ కావడంతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సీటు ఏ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులకు కేటాయించాలనేదానిపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా పరిషత్ ఎస్సీ రిజర్వుడ్ జల్లా పరిషత్ చైర్ పర్సన్ సీటు కోసం

మిగతా 2లో

## ఆశావహుల బలాబలాలపై సర్వే

### నివేదిక ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక

**రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీకి సంబధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక అంతా సిఎం, పిసిసి చీఫ్, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆధ్వర్యంలోనే జరుగనుంది. సర్వే రిపోర్ట్ ఆధారంగా పోటీ చేసే అభ్యర్థులకు టిక్కెట్లు ఇవ్వనున్నారు. పదేళ్ల తర్వాత పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఉండటం, స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆచి తూచి గెలుపు గుర్రాల ఎంపిక ప్రక్రియ సాగుతోంది.

**ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కమిటీలు...**

స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీఆర్ఎస్ కసరత్తుచేపడుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మండల కమిటీలను నియమించారు. కమిటీల ఆధ్వర్యంలో అభ్యర్థులను ఎంపిక చేసి పోటీలో దించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా పరిధిలో గత వైభవాన్ని తిరిగి తెచ్చుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగానే అభ్యర్థులను నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

మిగతా 2లో



గురుకులాల మెటీరియల్‌ను తీసుకెళ్లడంతో పాతకొడంగల్‌లో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

## ఎడ్యుకేషన్ హబ్ హుష్‌కాకి...


### లగచర్ల, హకీంపేటకు తరలిన సమీకృత గురుకులాలు
### నిధులు మంజూరైన సంవత్సరానికి అరకొర పనులు
### అర్భాటంగా భూమిపూజలు..మూడు నెలలకే గురుకులాల తరలింపు
### బఫర్ జోన్ కారణంగానే తరలింపు అంటున్న అధికారులు

**కొడంగల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు నియోజకవర్గ కేంద్రంలో ఉంటే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోనే సీఎం ప్రాతి నిథ్యం వహిస్తున్న కొడంగల్ పురపాలక పరిధిలోని పాతకొడంగల్‌లో సమీకృత గురు కులాలు (ఎడ్యుకేషన్ హబ్)నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొడంగల్ నిర్మాణం చేసే గురుకులాల కోసం గత అగస్టు 24లో మొదటి విడతగా రూ.100 కోట్లు విడుదల చేశారు. పురపాలక పరిధిలోని పాతకొడంగల్ సమీపంలో 20 ఎకరాల స్థలంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి చేతుల మీదుగా గత 11 అక్టోబర్ 2024లో అర్భాటంగా అట్టహాసంగా గురుకులాల నిర్మా ణానికి పూజలు చేశారు. ప్రస్తుతం పాతకొడంగల్‌లో సమీకృత గురుకులాలను ఆకస్మాత్తుగా తరలించేండం వెనుక ఎవ్వరికి అంతపట్టడం లేదు.సమీకృత గురుకుల తరలిం పుపై ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు తమకు సమాచారం లేదంటూ తప్పించుకోవడంతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ హబ్ హుష్‌కాకి గానే మారనుందని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు.సమీకృత గురుకులాలు ఇక్కడ ఏర్పాటు చేస్తే విద్య పరంగా వెనుకపడిన కొడంగల్ రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయని భావించిన ప్రజల ఆశలపై అధికారులు,కాంట్రాక్టర్,ప్రజాప్రతినిధులు నీళ్ళు చల్లారని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా కొడంగల్ నుంచి సమీకృత గురుకులాల తరలింపు ప్రక్రియను నిలుపుదల చేసి ఈ ప్రాంతంలోనే సమీకృత గురుకులాలను నిర్మించాలని కొడంగల్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

**ఎడ్యుకేషన్ హబ్‌కు నిధులు ఇలా..**

ఒకే వేదికపై అన్ని పాఠశాలలు,కళాశాలు,క్రీడా ప్రాంగణాలు నిర్మాణం చేసేందుకు ఏర్పాటు చేశారు. ఎస్పీ గురుకుల పాఠశాల,కళాశాలకు రూ.45కోట్లు, బీసీ గురుకుల పాఠశాల, కళాశాలకు రూ.25కోట్లు,మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలకు రూ.20 కోట్లు వెనుకబడిన తరగతుల కళాశాలకు రూ.18 కోట్లు కేటాయించారు. వీటితో పాటు పార్కులు,క్రీడా ప్రాంగణం, కిచన్‌షెడ్ ఇలా అన్నింటికి కలిపి సుమారు రూ.250కోట్ల అంచనాలతో పూజలు చేశారు. ఈ పనులు 8 నెలల తరువాత ప్రారంభించి

మిగతా 2లో



పెద్దేముల్ మండలం కందనెల్లి వాగు పక్కన మునిగిపోయిన వరి పంట

## కల్లాల్లో కన్నీళ్లు...

### ఆగమాగం చేసిన అకాల వర్షం- తడిసిన మొక్కజొన్న దిగుబడి
### గింజల్లో తేమ శాతం పెరిగే ప్రమాదం- నాణ్యత తగ్గి ధర పలకదని రైతుల ఆందోళన
### నీట మునిగిన వరి, కంది పంటలు - పరిహారం ఇవ్వాలని డిమాండ్

**కేశంపేట అక్టోబరు 5 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలో ఆదివారం అకాల వర్షం ఆగమాగం చేసింది. చేతికొచ్చిన మొక్కజొన్న దిగుబడులు తడిసి ముద్ద అయ్యాయి. ఉదయం మండలంలోని అన్ని గ్రామాలలోనూ భారీ వర్షం కురిసింది. యాసంగి సీజన్లో ఇతర పంటలను సాగు చేసుకోవాలన్న లక్ష ్యంతో రైతులు ముందుగానే మొక్కజొన్న పంటను కోసి కల్లాలలో ఆరబెట్టుకున్నారు. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్నలు కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. అకాల వర్షానికి చేతికొచ్చిన పంట తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు.

మండల పరిధిలో ఈ ఏడాది 35 వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ భూములు ఉండగా అందులో దాదాపుగా 15 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. ఎకరానికి 25 వేల నుండి 30 వేల వరకూ ఖర్చు పెట్టామని రైతులు వివరించారు. పంట దిగుబడి మంచిగా వస్తే ఒక ఎకరానికి 55 వేల నుండి 60 వేల వరకూ ఆదాయం వచ్చేదని తెలిపారు. అకాల వర్షం కారణంగా పంట దెబ్బతినడంతో గిట్టుబాటు ధరలు రాక ఆదాయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. పంట చేతికి వచ్చే సమయానికి వర్షం పడటం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటకు కంకులు తడిసి గింజల్లో తేమ శాతం బాగా పెరిగిపోతుందన్నారు. దానివల్ల నాణ్యత తగ్గి మార్కెట్లో ధర తగ్గుతుందని చెప్పారు. తడిసిన గింజలలో ఫంగస్ ఏర్పడి గింజలు నల్లగా మారి బూజు పడితే తీవ్రంగా నష్టపోతామని, ఇలాంటి గింజలను కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలు కానీ దళారులు కానీ ఎవరు కూడా ఇష్టపడరని వాపోయారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



ఆరబెట్టుకున్న మొక్కజొన్న పంట తడిసిన దృశ్యం

**కాస్త కోలుకుంటున్నామనుకుంటే...**

**పెద్దేముల్ :** శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు నీట మునిగాయి. వారం క్రితం కురిసిన వర్షాలకు పంటలకు తీవ్రం నష్టం వాటిల్లింది, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతులకు శనివారం కురిసిన భారీ వర్షానికి వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగి అపార నష్టం వాటిల్లింది. అడ్కిచెర్ల, తట్టెపల్లి ఎగువన కురిసిన భారీ వర్షానికి వచ్చిన వాగు ప్రవాహంతో ఆత్కూర్, నర్సాపూర్, రుద్రారం, బుద్దారం, గాజీపూర్, ఖానాపూర్, కందనెల్లి గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు నీట

మిగతా 2లో

# కల్లాల్లో కన్నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

మునిగాయి. వాగు పక్కన పంట పోలాలు ఉండటంతో నీటి ఉధృతికి అక్కడక్కడ కొట్టుకుపోయాయి. అంతేగాకుండా నీటి ప్రవాహానికి పంటలు నీటమునిగి వాగును తలపించాయి. పంటలకు పెట్టిన పెట్టుబడితో పాటు వాటికి అయ్యే వడ్డీ ఎలా చెల్లించాలని రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంతకు ముందు కూడా పంటలు నష్టపోయిన తమకు ఇంతవరకు నష్ట పరిహారం రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబందిత అధికారులు పంట నష్టం అంచనా వేయటంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అకాల వర్షాలతో పంటలకు అపారనష్టం వాటిల్లిందని ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దుద్దిళ్లకు ప్రతిష్టాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

ముచ్చటగా మూడు నియోజకవర్గాల నుంచి పోటీ పడుతున్నట్లు సమాచారం. చేవెళ్ల, శంకర్ పల్లి జడ్పీటీసీ స్థానాలు రెండు ఎస్సీ జనరల్ కోటా క్రింద రిజర్వ్ చేశారు. ఇక్కడ ఎస్సీ పురుషుడు లేదా ఎస్సీ మహిళా గాని పోటీల్లో ఉండానికి అవకాశం కల్పించారు. ఇక ఇదే నియోజకవర్గంలోని షాబాద్, మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు ఈ రెండు మండలాలను ఎస్సీ మహిళలకు రిజర్వు చేశారు. ఈ నాలుగు మండలాల్లో పోటీ చేసిన అభ్యర్థులే జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కు పోటీలో ఉండానికి ఆవకాశముంటుంది.

**సీనియర్‌ల చేతికి ఎన్నికల వ్యూహరచన**

ఇక జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సీటు ఎస్సీ మహిళా కోటా క్రింద రిజర్వ్ చేయడంతో ఈ నాలుగు మండలాల్లో పోటీ చేయడానికి మహిళ అభ్యర్థులను రంగంలోకి దింపడానికి శ్రీకారం చుట్టింది. ఈ మండలాల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల జడ్పీటీసీ అభ్యర్థుల విజయం కోసం జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా ఎలాంటి వ్యూహ ప్రతివ్యూహాలు చేపట్టబోతున్నారనేదానిపై సైతం కాంగ్రెస్ పార్టీలో కూడా ఒక ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నాలుగు మండలాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొంతమంది సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించనున్నారు. ఇక మిగితా జడ్పీటీసీ స్థానాలు బీసీ, ఎస్టీ, జనరల్ స్థానాల్లో సైతం బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపి వారి విజయం కోసం స్థానిక ఎమ్మెల్యేలకు, ఇంచార్జీ నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

**ప్రతిపాదన జాబితాలు సిద్ధం**

ఇక జిల్లాలోని ఎంపీటీసీ స్థానాలకు, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లతో కూడిన నివేదికలు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అందజేశారు. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి నాయకులే ఎంపిక చేయనున్నట్లు ఇక మిగితా జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక రాష్ట్రస్థాయిలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కార్యవర్గంతో కలిసి చర్చించి అభ్యర్థుల ఎంపిక ఉండనుందని అవకాశముంది.

# అధిష్టానానికి నివేదిక ఇచ్చాం

## మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి

**మహేశ్వరం, అక్టోబరు 5 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అగ్రతాంబూలం పట్టామని మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జీ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మహేశ్వరం, కందుకూరు మండల జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక పేర్లు (3) టీపీసీ సీకి అందజేశారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డితో కలిసి ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి జెడ్పీటీసీ అభ్యర్థుల పేర్లు, సామాజిక సమీకరణలను వివరించారు.

**కాంగ్రెస్ అభ్యర్థుల విజయం తథ్యం**

కాంగ్రెస్ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, స్థానిక నాయకత్వం, సామాజిక సమీకరణలే తమ అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. టీ.పీసీసీ ఆదేశాల మేరకు మహేశ్వరం, కందుకూరు మండల అభ్యర్థుల మూడు పేర్లను మంత్రి శ్రీధర్ బాబుకి జిల్లా నేతలతో కలిసి జాబితా సమర్పించామని కేఎల్ఆర్ తెలిపారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా... ఎన్నికలకు ముందే సమయత్తం కావాలని పిలుపునిచ్చారు.

# ఆశావహుల బలాబలాలపై సర్వే

(మొదటి పేజీ తరువాయి)

ఆయాసామాజిక వర్గాల వారిగా బలమైన అభ్యర్థులను దించడంతో పాటు మెజార్టీ సీట్లను కైవసం చేసుకునే విధంగా ప్రయత్నాలు చేసున్నారు. జిల్లా పరిధిలోని జెడ్పీ పీఠాలపై దృష్టి పెట్టిన పార్టీ నేతలు బలమైన నేపథ్యం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసిగెలిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ నుంచి జెడ్పీటీసీ వరకు తగిన అభ్యర్థులను గుర్తించే విధంగా ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా జిల్లాల పరిధిలో తగిన ప్రాధాన్యత నేతలకు ఇవ్వడంతో పాటు రిజర్వేషన్ కు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే రీతిలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడా పూర్తిస్థా యిలో సన్నద్ధమయ్యారు..

# కారిడార్ పూర్తి చేయాలని సిపిఎం కరపత్రాలు పంపిణీ

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ అక్టోబర్ 6న జరిగే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మించతలపెట్టిన కారిడార్ వెంటనే పూర్తి చేయాలని, కారిడార్ పనులు నిలిపివేయడం వల్ల వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కారిడార్ పనులు పూర్తి చేసే వరకు సిపిఎం పార్టీ పోరాటం చేస్తుందన్నారు. సోమవారం ఉప్పల్ చౌరస్తాలో భారీ ఎత్తున నిరహారదీక్ష కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సిపిఎం కార్యదర్శి వెంకన్న, రాజు, మురళీ మోహన్, పట్టాభి రామయ్య తదితరులు పాల్గొన్నారు

# మురుగునీటి సమస్యను పరిష్కరిస్తా

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీలో ఎస్.ఎన్.డి.పి నాలా మురుగునీరు క్యాచ్‌పిట్స్ ద్వారా గత పదిహేను రోజులుగా పొంగి పొర్లుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదివారంనకాలనీలో పర్యటించి సమస్యను పరిశీలిం చారు. సమస్య పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. నాలాలో పేరుకుపోయిన సిల్ట్‌ను వెంటనే తొలగించాలని, అవసరమైతే నాలా స్లాబ్ కట్ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చెరువు ముఖ ద్వారం వద్ద పేరుకు పోయిన సిల్టును తొలగించాలని అధికారులకు సూచించారు. జోనల్ కమీషనర్‌తో మాట్లాడి శివగంగ థియేటర్ వద్ద ఔట్‌లెట్ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పగిడిమర్రి తిలక్‌రావు, మామిడి జగన్నాథ్‌రెడ్డి, మధుసాగర్, ప్రకాష్, ఇంద్రాజీ, అనిల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామా ప్రచారం అవాస్తవం : దానం

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. రాజీనామా ప్రచారం వాస్తవంకాదని స్పష్టంచేశారు.గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారని, ఎవరూ నమ్మొద్దు అని విజ్ఞప్తి చేశారు.

# ఎడ్యుకేషన్ హబ్ హుష్ కాకి

(మొదటి పేజీ తరువాయి)

భవన నిర్మాణానికి పునాదులు వేశారు.ఇందుకుగాను లేబర్ షెడ్‌లు,స్టీలు,సెమెంట్,ఇటాచీలు ఇతరాత్ర యంత్రాలు అన్ని చేరవేశారు.ఇక పనులు శరవేగంగా కొనసాగుతాయని భావించిన నెలలోపే అన్ని నిలిపి వేశారు.పాతకొడంగల్ నుంచి లగచర్ల, హకీంపేట ప్రాంతాలకు తరలిస్తున్నారని సమాచారం.

**ఇప్పటికి ఒక గిరిజన గురుకులం**

సమీకృత గురుకులాలకు కేటాయించిన స్థంలో గత నాలుగు సంవత్సరాల క్రితం గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణం పూర్తియి విద్యార్థులు చదువుకుంటూన్నారు. గిరిజన గురుకులంతో పాటు ఇతర గురుకులాలకు ఒకే వేదికపైకి వస్తే సుమారు 2500 మంది విద్యార్థులు ఉండి చదువు కుంటారు. అందుకోసం వీటికి పక్కనే ఉన్న చెరువుకు మినీ ట్యాంకు బండ్‌గా మార్చిరూ.45కోట్లతో డబుల్‌రోడ్డు, పార్కు, జిమ్, బోటింగ్ తరహాలో అన్ని విధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయింపు చేశారు. పనులు సైతం వారం రోజుల పాటు చెరువు కట్టపై కొనసాగాయి. విద్యార్థులు ఇక్కడ లేకపోతే మినీట్యాంక్ బండ్ సైతం వృధా అవుతుందని ప్రజలు అంటున్నారు.

**కాంట్రాక్టర్ ఒత్తిడికి తలొగ్గారా..?**

పురపాలక పరిధిలోని పాత కొడంగల్‌లో నిర్మాణం




పాతకొడంగల్‌లో సమీకృత గురుకులాల నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్ ఫొటో)

చేసేందుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ హైద్రాబాద్‌లో అత్యంత పేరుగాంచిన ఓ ప్రజా ప్రతినిధి బంధువులు. ఆయన ఈ ప్రాంతానికి స్టీలు, సిమెంట్, భారీ వాహనాలు, ఇతర పరికరాలు తీసుకొని రావడానికి రవాణా సరిగ్గా లేదు. పాతకొడంగల్ గ్రామం మధ్యలో ఇళ్ళు ఉండడంతో భారీ వాహనాలు రాలేకపోతున్నాయి. ఇప్పటివరకు స్టీలు ఇతర సామాగ్రి తీసుకొని వచ్చే సమయంలో పాతకొడంగల్ స్టేజీ వరకు పెద్ద వాహనాల్లో తీసుకొని వచ్చి అక్కడి నుంచి చిన్న లారీలు ఇతర వాహనాల్లో తీసుకొని వచ్చారు. ఇలాంటి పరిస్థితి ఇబ్బందిగా ఉందని తమ పనులకు అనుకూలగా ఉండడం లేదని ఒత్తిడి తీసుకొచ్చి పనులు నిలిపివేశారు.

# కొట్టుకుపోయిన ధారూర్ రోడ్డు ...



భారీ వర్షాలతో దెబ్బతిన్న దేవరయాంజాల్‌లో ఆర్‌అండ్‌బి మెయిన్ రోడు



దేవరయాంజాల్-తూంకుంట గ్రామాల మధ్య రోడ్డుపై గుంతల దృశ్యం

**ధారూరు, అక్టోబరు 5 ప్రభాతవార్త:** ధారూర్ మండలం వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం కురిసింది. కోట్పల్లి ప్రాజెక్టు కు వరద భారీగా రావడంతో.. భారీ వర్షంతో ప్రాజెక్ట్ పూర్తిగా నిండిపోయింది. దీంతో నాగసమందర్ బ్రిడ్జి వైపు అలుగు నీరు ప్రవహిస్తోంది. అయితే ఇటీవల కురిసిన వర్షానికి బ్రిడ్జి తెగిపోవడంతో ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలికంగా రోడ్డు వేసిన విషయం తెలిసిందే, శనివారం కురిసిన వర్షానికి తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో అటువైపు రాకపోకల ు పోలీసులు నిలిపివేశారు. మైలారం నాగారం మధ్య బ్రిడ్జి పై నుంచి నీరు ఉద్రిక్తంగా ప్రవహించడంతో అటువైపు కూడా రాకపోకల ు నిలిపివేశారు. బ్రిడ్జిపై నుంచి నీళ్లు ప్రవహించేటప్పుడు కానీ, చెరువుల వద్దకు ఎవరు కూడా వెళ్లరాదని ఎస్ఐ సున్నం రాఘవేందర్ సూచించారు.

**దేవరయాంజాల్ రహదారి ధ్వంసం**

**శామీర్‌పేట, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దేవరయాంజాల్ ఆర్‌అండ్‌బి రోడ్డు పూర్తిగ దెబ్బతిని వాహానాల రాకపోకలకు ఇబ్బందికరంగ మారింది. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లో ఆర్‌అండ్‌బి మెయిన్ రోడ్డు బాగ దెబ్బతిన వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దేవరయాంజాల్‌లోని మహాలక్ష్మి కాలనీతో పాటు పలు కాలనీల వరద నీరు మెయిన్ రోడ్డు కు చేరటం ఆ రోడ్డు పూర్తిగ దెబ్బతినటం జరిగింది. అయితే కొంత మేరకు తాత్కాలికంగ మున్సిపల్, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు స్పందించి కొంత మేరకు తాత్కాలిక మరమ్మతు పనులు చేసినా మళ్లీ కురిసిన వర్షాలతో వరద తాకిడి పెరిగి వాహానాల రాకపోకలు ఇబ్బందికరంగ రోడ్డు మారిందని పలువురు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బి, మున్సిపల్ సంబంధిత అధికారులు స్పందించి దేవరయాంజాల్‌లో ఎన్టీఆర్ విగ్రహంకు చేరువలో మెయిన్‌రోడ్డు పూర్తిగ దెబ్బతిని కందకంలా మారి నీటి నిల్వ పెరిగి వాహానాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

వరద పారుకం తగ్గినా ఆ రోడ్డు కందకంలా మారి వాహనదారులు రాకపోకలు నిర్వహించటానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇకనైనా శాశ్వతంగ ఉండేలా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని, అదే విధంగ గుంతలమయంగా మారిన ఈ రోడ్డుకు వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని పలు గ్రామాల వారు, స్థానికులు,పలువురు వాహనదారులు కోరుతున్నారు.

# కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

**సరూర్‌నగర్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కాలనీల్లో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి హామీనిచ్చారు. కార్పొరేషన్‌కు సంబంధించిన నాలుగవ డివిజన్ అల్మాస్‌గూడ న్యూ మధురాపురి కాలనీ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎన్నికైన నవీన్‌రెడ్డి, గౌరవాధ్యక్షునిగా ఎన్నికైన మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా ఎన్నికైన అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రేవంత్, కోశాధికారిగా ఎన్నికైన ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన బల్వంత్‌ను ఆయన గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డితో కలిసి అభినందించారు. ఈ సందర్భం గా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు పాలకవర్గం లేనందున కాలనీల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే తాము ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా కాలనీల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమల య్యేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు తాదూరి వెంకటరమణ, కాలనీవాసులు మహేందర్‌రెడ్డి, శంకర్ నాయక్, నాగార్జున, ఎస్‌వీఎస్ ప్రసాద్, బసవరాజు పాల్గొన్నారు.

# శేషాద్రినగర్ పార్కులో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

**సరూర్‌నగర్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 4వ డివిజన్ అల్మాస్‌గూడ శేషాద్రి నగర్ కాలనీ పార్కు స్థలంలో తన స్వంత డబ్బులతో స్థానికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయించిన హైమాస్ట్ లైట్లను ఆదివారం ఎఐసిసి తరుణ్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి ముందుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# కుట్టుమిషన్ల పంపిణీ

**చిక్కడపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దాదాపు ఐదులక్షల రూపాయల విలువల చేసే వస్తువు లను అర్హులైన లబ్ది దారులకు అసోసియేషన్ అధ్యక్షుడు రేణుకంట్ల నమ: శివాయ, కార్యదర్శి ఎం.రవిగుప్త, కోశాధికరి మాకం బద్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నలభైఐదు మంది మహిళలకు కుట్టుమిషన్‌లు, పదిహేను మంది విద్యార్థులకు రెండఉ లక్షల రూపాయలను ఉన్నత చదువుల నిమిత్తం ఉపకార వేతనాలను అందించారు. దీంతో పాటు ఆరు అనాధ ఆశ్రమాలకు వంటసామాగ్రి కూడా అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

# లోకల్ సరకు.. బ్రాండెడ్ ముసుగు

* అక్షరాలు మార్చి... ధరతో ఏమార్చి!.. * ప్రధాన కంపెనీల పేర్లను తలపించేలా విద్యుత్ ఉపకరణాలు
* మార్కెట్‌లో విచ్చలవిడిగా స్థానిక తయారీ పరికరాల విక్రయం * కొద్దికాలానికే వైఫల్యం, విద్యుదాఘాతంతో ప్రమాదాలు

**హైదరాబాద్, అక్టోబరు 5,ప్రభాతవార్త**

నకిలీ విద్యుత్ సామగ్రి అమ్మకాలు మార్కెట్ లో పెరిగిపోతున్నాయి. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం కాకుండా నాణ్యతలేని ముడిసరకుతో స్థానికంగా తయారు చేసిన వాటిని తక్కువ ధర లకు విక్రయిస్తున్నారు. ప్రముఖ బ్రాండెడ్ కంపె నీల పేర్లను కొద్దిగా మార్చేసి... అవీ బ్రాండెడేనంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. వీటి కారణంగా ఒక్కోసారి షాక్‌తగిలి ప్రాణాలు కోల్పోతున్నారని విద్యుత్ శాఖ వర్గాలు తెలిపాయి. ఇళ్లల్లో, వాణిజ్య సముదాయాల్లో ఉపయోగించే తీగలు, స్విచ్‌బోర్డులు, బల్బులు, ఫ్యాన్లు, కుక్కర్లు, గ్రైండర్లు వంటి వాటికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆమోదం ఉంటేనే కొనాలి. కానీ, వ్యాపారుల మాయాజాలంలో చిక్కుకుని చవక వస్తువులనే కొంటూ ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏది అసలు, ఏది నకిలీ, ఏది లోకల్... అనేది పోల్చుకోలేనంతగా ప్యాక్ చేసి ఉంటున్న డబ్బాలతో కొనేది బ్రాండెడ్ వస్తువులు గానే మరికొందరు అపోహ పడుతున్నారు.

**ఎలక్ట్రీషియన్ చెబుతాడు..వాళ్లు కొనేస్తారు...**

నగరంలో ప్రతి సంవత్సరం లక్షకుపైగా ఇళ్లకు కొత్త విద్యుత్ కనెక్షన్లను ఇస్తున్నారు. ఒక్కో ఇంటికి విద్యుత్ సామగ్రి ఏర్పాటుకు కనిష్ఠంగా రూ.50 వేలనుంచి గరిష్ఠంగా రూ.2.50 లక్షల వరకు అవుతుంది. ఎలక్ట్రిషియన్లు,యజమానుల మధ్య కమీషన్ల సంబందాలు ఉండటంతో తీగలు, స్విచ్‌లు, బల్బులు, ఫ్యాన్లు, ఎగ్జాస్టర్లు తదితరాలను లోకల్, నాసిరకం వాటినే కొంటున్నారని విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు. ఒకవేళ తామే కొంటామంటూ ఎవరైనా ఇళ్ల యజమానులు చెబితే.. ఫలానా దుకాణంలో తక్కువ ధరకు దొరుకుతాయని సూచిస్తుండటంతో అక్కడికే వెళుతూ మోసపోతున్నారు. ఇక ఇటీవల అపార్ట్ మెంట్‌ల సంస్కృతి



విపరీతంగా పెరగడంతో అంతా సిద్ధమైన ఫ్లాట్లను కొంటున్నారు. వాటిని నిర్మిస్తున్నవారు లాభాల కోసం పైకి కనిపించే స్విచ్‌లు, వాటి బోర్డులను నాణ్యమైనవి బిగిస్తూ లోపల తీగలు లోకల్‌వి వాడే ప్రమాదముందని ఇలాంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఇంజినీర్లు సూచిస్తున్నారు.

**ధర తక్కువంటూ.. బురిడీ**

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రముఖ కంపెనీ ఫ్యాన్‌ను రూ.1,700కి విక్రయిస్తామని దుకాణ యజమాని చెప్పారు. దాని కింద అదే పేరును తలపించేలా ఉన్న స్థానికంగా తయారైన దాన్ని రూ.1100కి ఇస్తామని తెలిపారు. ఇవి ఇక్కడే లభ్యమయ్యే పరికరాలతో తయారైనం దునే ధర సగం తగ్గుతుందని తెలిపారు.పైనున్న దానికి ఐఎస్ఐ మార్కు ఉండగా.. కింది దానికి ఐఎస్ఐ మార్కు లేకపోవడం గమనార్హం. అలాగే ప్రముఖ కంపెనీకి చెందిన 10 వాట్ల ఎల్ఈడీ బల్బ్‌ను రూ. 280 ఇస్తామని దుకాణ యజమాని తెలిపారు. పక్కనే దాన్ని పోలిన పేరుతో ఉన్న 30వాట్ల ఎల్ఈడీ బల్బ్‌ను రూ.80 ఇస్తామన్నారు. రెండూ ఒకేలా వెలుగునిచ్చినా... రెండోది ఎంత కాలం పనిచేస్తుందనే గ్యారంటీ ఇవ్వలేమన్నారు.

**అత్యంత కీలకం సీఈఏ నిబంధనలు..**

ఇళ్లు, కార్యాలయాలు, ఇతరచోట్ల విద్యుత్ సామగ్రిని బిగించడానికి తప్పనిసరి పాటించాల్సిన నియమాలను 2023 కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) జారీ చేసింది. భారత జాతీయ భవనాల కోడ్(ఎన్‌బీసీ-2016), భారత జాతీయ విద్యుత్ కోడ్ (ఎన్ఈసీ-2023) ప్రకారం వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కానీ, ఇళ్లలో పనిచేసే ఎలక్ట్రిషియన్లకు అసలీ నియమాలే తెలి యదని విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు. విద్యుత్ దీపాలు వెలిగే పాయింట్ వరకు 1.5 చదరపు మిల్లీ మీటరు(చ.మి.మీ.), విద్యుత్ ప్లగ్‌లు పెట్టే పవర్ పాయింట్లవరకు 2.5. ఏసీ తదితర అధిక విద్యుత్ అవసరమయ్యే సామగ్రి పవర్ పాయింట్‌వరకు 4 చ.మి.మీ. విద్యుత్ తీగలను వినియోగించాలి. కానీ, చాలామంది ధరల విషయంలో రాజీపడుతున్నారు. ఈ కారణంగా తీగలకు సరఫరా అయ్యే కరెంటు లోడ్‌లో తేడా లొచ్చి గృహోపకరణాలు కాలిపోతాయి. ఒక్కోసారి మంటలు వచ్చి అగ్ని ప్రమాదాలు జరుగు తాయి. షాక్ తగిలి ప్రాణాలు కూడా పోతాయి. పైగా ఏళ్ల తరబడి వాటిని పని తీరును పట్టించుకోరు. విద్యుత్ సామగ్రి బిగింపు పనులను లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్లు, ఐటీఐలో ఎలక్ట్రిషియన్ కోర్సు ఉత్తీర్ణులైన మెకానిక్‌లతోనే చేయించాలి. కానీ, ఇళ్లలో విద్యుత్ పనులు చేసే అత్యధిక శాతం మెకానిక్‌లకు అసలు ఎలాంటి అర్హతలు ఉండవు. ఎక్కడో, ఎవరో చేస్తున్న పనులను చూసి, నేర్చుకున్నవారే అధికంగా ఉంటారు.

# తొమ్మిది మందికి ఫుడ్ పాయిజన్

## కోరంటి హాస్పిటల్‌లో చికిత్సలు...

**మెహిదీపట్నం, అక్టోబరు 5, ప్రభాతవార్త :**

టోలిచౌకిలోని అల్ వాడి హోటల్‌లో మండి బిర్యాని తిని 9 మందికీ తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన టోలిచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ రమేష్‌నాయక్ కథనం ప్రకారం... చాంద్రాయణ్‌గుట్టకు చెందిన కాలేద్ బిన్ అలీ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి టోలిచౌకి ప్యారా మెంట్ కాలనీలోని అల్ వాడి హోటల్‌లో మండి బిర్యానీ తిన్నారు. బిర్యానీ తిన్న వెంటనే 9 మందికి కడుపులో నొప్పి, వాంతులు, విరోచనాలు కావడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకోగా తగ్గలేదు. దీంతో డాక్టర్లు కోరంటి ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో వారు కోరంటి ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకున్నారు. కాగా ఆస్పత్రిలో ఆదివారం కూడా విరోచనాలు అవుతుండడంతో మధ్యాహ్నం టోలిచౌకి పిఎస్‌లో అలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే సంబంధిత అధికారులు పలు హోటళ్ల యజమానుల వద్ద భారీ మొత్తంలో మామూళ్లు తీసుకోవడంతోనే తనిఖీలు ఏమాత్రం చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇలాంటి హోటళ్లపైన దాడులు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతు నివాసంలో పిడుగు

**సరూర్‌నగర్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఆర్‌సిఐ సమీపంలోనున్న సుల్తాన్‌పూర్ గ్రామంలో పిడుగు పడింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో స్థానిక సుల్తాన్‌పూర్ రైతు, బాలాపూర్ బండ్లగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ అన్నె శ్రీనివాస్‌రెడ్డి నివాసంలోని కొబ్బరి చెట్టుపై భారీ శబ్ధంతో పిడుగు పడడంతో ఊరంతా ఉలిక్కి పడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై వర్షం కురుస్తున్న సమయంలో మెరుపులు, మేఘా ల గర్జనల మధ్య ఒక్కసారిగా దద్ధరిల్లేలా భారీ శబ్ధంతో ఊర్లో పిడుగు పడడంతో గాఢ నిద్రలో ఉన్న గ్రామస్తులంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

# గ్రూప్1 ఉద్యోగాలు సాధించిన భెల్ ఉద్యోగులు

**శేరిలింగంపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రం నిర్వహించిన గ్రూప్1 పరీక్షల్లో బీహెచ్ఈఎల్‌కు చెందిన జగదీశ్ ఆర్‌డీఓగా, నిషాంత్‌కు డీఎస్పీగా అవకాశాలు దక్కాయి. ఈ సందర్భంగా బీసీ సంక్షమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన తెలంగాణ ఆర్‌డీఓ అధికారి జగదీశ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు.అదేవిధంగా డీఎస్పిగా నియమితులైన నిషాంత్‌ను అధికారులు అభినందనలు తెలిపారు. వీరు ఇరువురు బీహెచ్ఈఎల్ మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. తోటి ఉద్యోగులు ఉన్నతాధికారులు వీరిని అభినందించారు. అదే విధంగా భెల్ సంస్థలో ఉద్యోగం ఉన్నప్పటికి గ్రూప్1లో ఉద్యోగ స్థానం లభించటంపై చాలా అనందంగా ఉందంటూ జగదీశ్,నిషాంత్‌లు సంతోషం వ్యక్తం చేశారు.

# అనాధ శరణాలయం, వృద్ధాశ్రమం ప్రారంభం

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 5, ప్రభాతవార్త :** సామాజిక సేవ చేయాలన్న సంకల్పంతో తలపెట్టిన సత్యం చారిటబుల్ ట్రస్ట్ తరఫున అనాధ శరణాలయం వృద్ధాశ్రమాన్ని ఆదివారం నిర్వాహకులు సత్యం ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ ప్రారంభించారు. బీరంగూడాకి దగ్గరలో భవానిపురం అమీన్‌పూర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ సత్య నారాయణ మాట్లాడుతూ మనిషికి మనిషికి తోడు, మనిషికి మనిషికి ధైర్యం, మనిషికి మనిషికి సహాయం చేసుకునే అలవాటు దీని ద్వారా మన సమాజానికి, తద్వారా ప్రపంచానికి చూపించాలని ప్రతి ఒక్కరిని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. తాను స్వచ్ఛందంగా చేపట్టిన ఈ సేవలో ప్రతి ఒక్కరు కూడా పాలు పంచుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా నని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్‌తో పాటు నిర్వాకులు అరవింద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానాల వెల్లువ

**పేట్‌బషీరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ తన నివాసం వద్ద ఆదివారం నియోజక వర్గం పార్టీ నాయకులు, ప్రజలు కలిసి పలు ఆహ్వానాలు అందజేసి ముఖ్యతిథిగా హాజరువ్వాలని కోరడం జరిగింది. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ వాళ్ళ ఆహ్వానన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ బ్యాంక్ రిటైర్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

**చిక్కడపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** ఆల్ బ్యాంక్ రిటైర్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలో అధ్యక్షుడు శరత్‌చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ విఠల్, సంయుక్త కార్యదర్శి పెద్ది పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు సమస్యలను, ఇతర అంశాలపై చర్చించి ఒక నిర్ణయం తీసుకున్నారు. బ్యాంక్‌లో పదవి విరమణ పొందిన వారికి హెల్త్ ఇన్స్యూ రెన్స్ విషయంలో తక్కువ ప్రీమియంతో ముందుకు వచ్చిన ఐసిఐసిఐ లంబార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని, ఈ బ్యాంక్ ద్వారా 50శాతం గ్రూప్ ఇన్స్యూరెన్స్ ద్వారా తమకు లబ్ది చేకూరే అవకాశం ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ వారే తక్కువ ప్రీమియంతో హెల్త్‌ఇన్స్యూరెన్స్ ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్దంగా ఎక్కువ ప్రీమియంతో ఇన్స్యూరెన్స్ అందించడం తమకు ఇబ్బందిగా మారిందని, ఇందుకుగాను అతి తక్కువ ప్రీమియంతో ఐసిసిఐ లంబార్డ్ సంస్థ తక్కువ ప్రీమియంతో హెల్త్ ఇన్స్యూరెన్స్ ఇవ్వడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందని, ఇదే విషయంపై అసోసియేషన్ ప్రతినిధులకు, సభ్యులకు తెలియజేయడం జరిగిందన్నారు.

అదే విధంగా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించుకుంటూ ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఐసిఐసిఐ లంబార్డ్ నేషనల్ హెడ్ గిరిధర్, శ్రీకర హాస్పిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ జనార్ధన్, డాక్టర్ కొమురవెల్లి తదితరులు పాల్గొన్నారు.

వార్త ఎఫెక్ట్

# నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై వేటు

## విధుల నుంచి తొలగింపు

**షాద్‌నగర్, అక్టోబర్ 05, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సును నడుపుతూ ఫోన్లో నిరాటంకంగా మాట్లాడుతూ అత్యంత నిరక్ష్యంగా డ్రైవింగ్ చేసిన అద్దె బస్సు డ్రైవర్ వినోద్‌ను ఆర్టిసి అధికారులు విధుల నుండి తొలగించారు. వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి డిపో మేనేజర్ ఉష తొలగించారు. నిరక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడుతూ ప్రయాణికులు ప్రశ్నించిన కూడా పట్టించుకోకుండా వివరించిన అద్దె బస్సు డ్రైవర్ వినోద్‌ను విధుల నుండి పక్కన పెట్టారు. అయితే ఇలాంటి ఘటనలే మరో రెండు మూడు జరిగినట్లు సమాచారం తెలుస్తుంది వారిని కూడా తీవ్రంగా మందలిచ్చి పక్కన పెట్టినట్టు సమాచారం. నిరక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడిన డ్రైవర్ తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఇప్పుడు విధుల నుండి తొలగించాక అందరూ కామెంట్ చేస్తున్నారు ఇక మాట్లాడుకో నాయనా తీరిగ్గా అంటున్నారు.



ఫోన్ మాట్లాడుతున్న డ్రైవర్(ఫైల్)

# ఎదులాబాద్‌లో ఘనంగా సుదర్శన హవనం

## –పంచరత్న సంకీర్తనలు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నార్‌నాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సుదర్శనహవనం ఘనంగా నిర్వహించారు. లోకకళ్యాణార్థం ప్రతినెలా మొదటి ఆదివారం ఆలయంలో ధరకర్తలు సుదర్శన హవనం జరుపుతున్నారు. తిరువడందెం పొరెత్తి వంశపారంపర్య ధర్మకర్తల వేదమంత్రోచ్చారణాల మధ్య ఆలయంలో ఉదకశాంతి, అంకుర్పాణ పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా గాన కళాకారులతో పంచరత్న సంకీర్తనల కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నగరం నుంచి వచ్చిన పలువురు దంపతులు భక్తితో హోమంలో పాల్గొన్నారు. పంచరత్న సంకీర్తన గానం



అందరిని ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

# ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో దుర్గామాత ఊరేగింపు ప్రారంభంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవిమహిపాల్‌గౌడ్

**ఘట్‌కేసర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. బి1 పార్కులో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాతను ప్రతిష్టించి తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దుర్గామాతను ఘనంగా ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్‌లు విచ్చేసి దుర్గామాతకు పూజలు చేసి శోభాయా త్రను ప్రారంభించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాలనీలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణ నెలకొందని వారు పేర్కొన్నారు. అనంతరం బ్యాండ్‌మేళాలు, కళాకారుల నృత్యాల మధ్య నిర్వహక కమిటి సభ్యులు ఉత్సాహంగా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.

# అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకం కరపత్రిక ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, ఈశ్వర్ తదితరులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహం ఆవరణలో జరిగిన కార్య క్రమంలో ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. షేడ్ స్వచ్ఛంధ సేవా సంస్థ 25 సంవత్సరాల (సిల్వర్‌జూబ్లీ) సందర్భంగా ఈనెల 12న ఘట్‌కేసర్ పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మండపంలో సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారితో "సంఘం చరణం గచ్ఛామీ" అంబేద్కర్ జీవిత చరిత్ర సాధించిన లక్ష్యాలపై పూర్తి చరిత్ర నాటకం ప్రదర్శించడం జరుగుతుందని అందరూ పాల్గొనాలని నిర్వహకులు–షేడ్‌స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు కడప ఈశ్వర్ తెలిపారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్‌లతో పాటు అంబేద్కర్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్నాం

## మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




**సరూర్‌నగర్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబిత ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ హయత్ కౌంటీ కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా స్థానిక మైనారిటీ ప్రజలకు మంచి నీటి సరఫరా ప్రారంభమైంది. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు, మహిళలు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబితారెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో నాటి సిఎం కెసిఆర్ సహకారంతో నియోజకవర్గంలో తాగు నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందనీ తత్ఫలితంగా గానే నేడు దశల వారీగా నీటి సరఫరా సమస్యలు తీరుతున్నాయమని వివరించారు. ప్రజలు కోరుకుంటున్న విధంగానే వారి సమస్యలను తీరుస్తూ అభివృద్ధిని చేపడుతున్నామని సబితారెడ్డి వెల్లడించారు. అదే విధంగా హయత్ కౌంటీ సమీపంలోని షరీఫ్‌నగర్, డ్రీమ్ సిటీ కాలనీల్లో కూడా తాగు నీటి సమస్యలను తీర్చడానికి ఆమె జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు మహమ్మద్ అకిల్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మహ్మద్ బాసిత్, అబ్దుల్ సత్తార్, జమాల్ హమీద్, అజీమ్ భాయ్, నసీరుద్దీన్, కాలనీవాసులు, మహిళలతో పాటు రామిడి రాంరెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, టేకుల భాస్కర్‌రెడ్డి, బొర్ర మాధవరెడ్డి పాల్గొన్నారు.

# మెట్రో రైల్ ప్లానింగ్‌లో సామాన్యుడు ఎక్కడ ?

**చిక్కడపల్లి అక్టోబరు 5 ప్రభాతవార్త:**

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో "మెట్రో రైల్ నష్టాలకు కారణమెవరు ? భవిష్యత్ సవాళ్లు ఏమిటి ? అనే అంశంపై ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఐలమ్మ ఆర్ట్ గేలరీలో చర్చా గోష్ఠి జరిగింది. హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ నుండి ఎల్ అండ్ టి తప్పు కున్న విషయంపై జరిగిన చర్చా గోష్టిలో ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ సి.రాంచంద్రయ్య మాట్లాడిన ప్రసంగించారు. ప్రయాణికుల ప్రయోజనాలకంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలే ముఖ్యం గా కొనసాగిన మెట్రో రైల్ ప్రాజెక్టు ఒప్పందం విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండగా మారుతుందన్నారు. అనేక వాగ్దానాలు చేసిన ఎల్ అండ్ టి సంస్థ వాటిని నిలబెట్టుకోలేకపోయిందని, ప్రయాణీకులసంఖ్య భారీగా పెరుగుతుందని వేసిన అంచనా పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కామన్ టికెట్ తెస్తామని చెబుతూనే ఉన్నారు, అమలుపై చిత్తశుద్ధిని ఏ ప్రభుత్వం పాటించలేదని, మెట్రో రైల్ ప్రాజెక్టు పేరుతో బస్ రవాణా, ఎంఎం టీఎస్, ఫుట్ పాత్‌ల వ్యవస్థలను నిరక్ష్యం చేశార న్నారు. గత ప్రభుత్వ హయాంలో 36 ఫ్లైఓవర్లు నిర్మించారు. కానీ ఒక్క ఫుట్ పాత్ కూడా నిర్మించ లేదన్నారు. తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం కన్వీనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ నష్టాల పేరు తో మెట్రో రైల్ నిర్వహణ నుండి ఎల్ అండ్ టి తప్పుకోవడం ఒప్పంద ఉల్లంఘనే అవుతుందని, ఎల్ అండ్ టి సంస్థ ఆర్థిక లక్ష్యాలు సాధించడంలో పూర్తిగా విఫలమైందని, నష్టాలకు పూర్తి బాధ్యత ఎల్ టినే వహించాలన్నారు. ఒప్పందానికి విరుద్ధం గా మెట్రో రైల్ ఛార్జీలు భారీగా పెంచిందని. సామాన్య ప్రయాణికులపై ఎల్




అండ్ టి భారం మోపిందని. ప్రయాణికుల సౌకర్యాలపై ఏ మాత్రం శ్రద్ధ వహించలేదన్నారు. రైల్ కోచ్ ల సంఖ్యను పెంచాలనే డిమాండ్ ను కనీసం పట్టించుకోలేదని, మెట్రో రైల్ రెండో దశ కు అనుమతి ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపిస్తుందని, కొర్రీలు వేయడం మానుకొని మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్చా గోష్టికి హెచ్.సి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి కే.వీరయ్య వక్తలను వేదిక మీదకి ఆహ్వానించగా, హెచ్.సి.ఎఫ్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సామాజిక వేత రాజీవ్ కుమార్ గారు, పర్యా వరణవేత్త డాక్టర్ జయసూర్య గారు ప్రసంగిం చారు. ఈ చర్చా గోష్టికి హెచ్.సి.ఎఫ్ నగర నాయకులు పి. శ్రీనివాసరావు, మోహన్, సంగీత, కె.లలిత, హస్మిత, జె. నర్సింగరావు, కె. రమేష్, శంకర్ లు నాయకత్వం వహించారు. కోశాధికారి రాజమోళి వందన సమర్పణ చేశారు.

# ఆదమరిస్తే అంతే సంగతి

## -ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
## -పొంచి ఉన్న ప్రమాదం

**మంచాల సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** మంచాల మండలం లోయపల్లి ఎల్లమ్మ తండా గ్రామాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతూ ఉన్నాయి. చేతికి తాకే విధంగా విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న స్పందించట్లేదని రైతులు వాపో తున్నారు చాలా రోజులుగా స్తంభాలు ఒరిగిపోయి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని , ఇదే రోడ్డు కుండా నిత్యం అధికారులంతా ప్రయాణిస్తున్నారని చూసి చూడనట్లే నిరక్ష్యం వహిస్తున్నారని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా



లోయపల్లిలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

జరగకూడని ప్రమాదం జరిగితే పూడ్చలేని నష్టం వాటితోందని దానికి అధికారులే ప్రధాన బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు.

# ఉజ్వల స్ఫూర్తితో విద్యార్థులు రాణించాలి





ఉజ్వలన అభినందిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దంపతులు

## పిల్లల ఎదుగుదలే తల్లిదండ్రులకు గొప్ప గౌరవం

**షాద్‌నగర్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** పిల్లల ఎదుగుదలే తల్లిదండ్రులకు సమాజంలో గొప్ప గౌరవమని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని తిరుమల కాలనికి చెందిన ఆర్ఎంపి లక్ష్మదేవి పద్మనాభం దంపతుల కుమార్తె బి.ఉజ్వల గ్రూప్ 1 ద్వారా కామర్షియల్ టాక్స్ అధికారిగా ఎన్నికైంది. ఈ సందర్భంగా బి.ఉజ్వలతోపాటు ఆమె తల్లిదండ్రులను అభినందిస్తూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ కష్టపడి చదివి కీలకమైన ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉజ్వలను విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఆమె పదోన్నతుల మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్ జూపల్లి కౌసల్య శంకర్,పిల్లి శారదాశేఖర్ మరియు నాయకులు దినేష్ సాగర్ రాఘవేందర్,హరి క్రిష్ణ,రమేష్ గౌడ్, నర్సిమా గౌడ్ తదితరులు సన్మానించారు. మరోవైపు పట్టణానికి చెందిన 27వ వార్డు మాజీ కౌన్సిలర్ విజయశ్రీ మురళీమోహన్ అప్పి దంపతులు కూడా ఉజ్వలను సన్మానించారు. ఆడపిల్లలు బాగా చదివి కుటుంబానికి తద్వారా సమాజానికి మంచి పేరు తెస్తారని సంతోషం వ్యక్తం చేశారు.

# సమానహక్కులు, బిసిల రిజర్వేషన్లకు అంబేద్కర్ కృషి



ప్రమాణం చేస్తున్న రాంరెడ్డి, వెంకటనారాయణ

**ఘట్‌కేసర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** భారతరత్న బిఆర్.అంబేద్కర్ 60 దేశాలకు సంబంధించిన రాజ్యాంగాలను చదివి కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించారని ముదిరాజ్ కోలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విబి.వెంకటనారాయణ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 234వ వారం నిత్యపూల కార్యక్రమం నిర్వహించారు. కోలి సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి విబి.వెంకటనారాయణతో పాటు ఉపాధ్యక్షులు బర్ల దేవేందర్, కురుపాల విజయ్‌కుమార్, కార్యనిర్వహక సభ్యులు ఉదారి సుదర్శన్‌లు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటనారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వచ్చే సంవత్సరంలో నిర్వహించే కులగణనలో అందరు పాలు పంచుకొని బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాటం చేయాలన్నారు. మహనీయుల ఆశయాల సాదన కోసం ప్రజలను చైతన్య పరిచేందుకు పీబీఐ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. అనంతరం భారత రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు సింగిరెడ్డి రాంరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, బండారు రాందాసు, కడప ఈశ్వర్, పులకంటి దామోదర్‌రెడ్డి, కడుపొల్ల మల్లేశ, నర్సింగ్‌రావు, అంకం సురేశ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటాచారీ, ఎం.వెంకటేశ్, శంకర్, బి.గణేశ్‌గౌడ్, ఎస్.కృష్ణంరాజు, సి.ఉపేందర్, ఈ.విష్ణు, డి.భరత్, లలిత తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

## షేక్‌పేట ఎన్నికల ఇంచార్జి అందేమోహన్

**షాద్‌నగర్, అక్టోబర్ 05, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయమని షేక్ పేట ఉప ఎన్నికల ఇంచార్జి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందేమోహన్ ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా షేక్‌పేట కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జిగా అధిష్టానం నియమించినందుకు అందే మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. తన భుజస్కందాలపై పెట్టిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చుతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని గుర్తుచేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు అడగాలని చూస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మాత్రమే ప్రజలు పట్టం కడతారని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్‌ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్నారని నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని షేక్ పేట ఉప ఎన్నికల ఇంచార్జి అందేమోహన్ పేర్కొన్నారు. షేక్ పేట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పార్టీ గెలుపుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మరోసారి వాగ్దానం ఇచ్చారు.



అందె మోహన్

## తెలంగాణ ఐటీ శాఖ మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేత



మంత్రికి పూల బొకే ఇస్తున్న చేగూరు యాదగిరి

**నందిగామ, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబును ఆదివారం ఉదయం నందిగామ మండలం చేగూరు గ్రామానికి కాంగ్రెస్ సీనియర్ నేత యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రికి పూల బొకే ఇచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న భీమ్ భరత్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్‌భరత్

**శంకర్‌పల్లి, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకొని సత్తా చాటాలని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి భీమ్ భరత్ అన్నారు. ఆదివారం శంకర్ పల్లి మండలం ముఖ్య కార్యకర్తల సమావేశంలో భీమ్ భరత్ పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థ ల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకు లందరూ కలిసి కట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చా రు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారికి ఫలితం ఉంటుందన్నారు . ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ నాయకులు ఉదయ్ మోహన్ రెడ్డి, శేరి అనంతరెడ్డి, యాదయ్య, మండల పార్టీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, వై ప్రకాష్, ఎజాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు రవీందర్ రెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, గండేటి శ్రీనాథ్ గౌడ్, మైనార్టీ నాయకులు మొహమ్మద్ సమీ, తదితరులు పాల్గొన్నారు.

# అధ్యక్షా తేలేదెప్పుడు..!

## ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో డోలాయమానం..
## జూబ్లీహిల్స్‌లో కార్యకర్తల అయోమయం

**జూబ్లీహిల్స్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభ్యర్థుల ఎం పిక వ్యవహారం పార్టీ అధిష్టానాలకు తలనొప్పిగా మారుతుంది. ఆశావాహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతోపాటు పోటాపోటీ ప్రచారాలు చివరికి సొంత పార్టీలోనే నష్టం కలిగిస్తాయనే అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావులకు అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ఇప్పుడు కొత్త సవాల్‌గా మారింది. ఒకవైపు కమి టీలు వేసి, మరోవైపు సమావేశాలు పెట్టి అభిప్రా యాలు సేకరిస్తున్నా ఏకాభిప్రాయం రావడానికి, అభ్యర్థిని ఎంపిక చేయడానికి ఇంకా సమయం పట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఆశా వాహులు టిక్కెట్ దక్కించుకొనేందుకు ఇప్పటికే తమకు తెలిసిన నాయకుల వద్దకు చక్కర్లు కొడు తుంటే మరికొందరు నేతలు ఏకంగా ఢిల్లీ కేం ద్రంగా తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించు కొనేందుకు రాజకీయం చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ నియోజకవర్గం లో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. బిఆర్ఎస్ పార్టీ ఇప్పటికే తమ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతగోపీనాథ్‌ను ప్రకటించింది. దీంతో ఆమె తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను పర్యటిస్తూ ప్రచారానికి పదును పెడుతున్నారు. మరోవైపు కేటీఆర్, హరీష్‌రావు తదితర నేతలు సైతం ఆమెకు మద్దతుగా ఇప్ప టికే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పండుగల నేపథ్యంలో మాగంటి సునీత వివిధ కార్యక్రమా లను ఏర్పాటుచేసి నియోజకవర్గ ప్రజలను ఆమె నేరుగా కలిశారు. వారి మద్దతును కోరారు. ఆమెతోపాటు ఆమె కుమార్తెలు సైతం ప్రచా రాన్ని ముమ్మరం చేశారు.

అధికార పార్టీలో అభ్యర్థి విషయంలో ఇంకా డోలాయమాన పరిస్థితి నెలకొని ఉంది. ఇక్కడి నుంచి అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగు తుండటం అటు అధిష్టానానికి సైతం ఇబ్బందిగా మారుతుంది. కాంగ్రెస్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, బొంతు రామ్మోహన్‌ల పేర్లు ప్రధానం గా వినిస్తుండగా వీరితోపాటు స్థానిక కాంగ్రెస్ నేతలైన నవీన్‌యాదవ్, రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పేర్లు బలంగా వినిస్తు న్నాయి.